క్లుప్తంగా

వైభవంగా గీతాజయంతి



గీతాజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక గురువులు, వక్తలు

పాలకొండ రూరల్: పట్టణంలోని నాగవంశపు వీధిలో గల రామ మందిరంలో గీతాజయంతి ఉత్సవాలను భక్తులు బుధవారం వైభవంగా చేపట్టారు. గీతా ప్రచారకులు కంచుమోజు రామ్మోహనరావు నేతృత్వంలో గీతా పారాయణం సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. వక్తలుగా కామేశ్వరరావు, జల్లు నారాయణ రావు, యోగేశ్వరావు, తదితరులు వ్యవహరించారు. గీతా సారాంశాన్ని భక్తులకు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఏటీఎం మోడల్ పంటలు పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్, తదితరులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల ఏటీఎం మోడల్‌లో పండిస్తున్న వివిధ పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, పలు సూచనలు చేశారు. దిబ్బగూడ, బూర్జగూడ గ్రామాల్లో అరటిలో అంతరపంటలుగా పండిస్తున్న పెసర, మినుములు, క్యారెట్, బెండ, తోటకూర, తదితర పంటలను పరిశీలించి రైతుల విజయగాథలను వీడియో రికార్డ్ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు మునలయ్య, బాలు, అంబోజి పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన



గ్రామ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ భాను, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని అర్దలి రహదారి పనులకు ఎంపీపీ బొమ్మాళి భాను బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ. 80 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వీపీ రాజుపేట నుంచి తమ గ్రామంలోకి ఈ పనులు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు అనుసరించాల్సిందే..



శివారు వీధుల్లో విద్యుత్ పునరుద్ధరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పాలకొండ రూరల్: విద్యుత్ రాయితీ పొందుతున్న లబ్ధిదారులు కచ్చితంగా నిర్దేశించిన నిబంధనలు అనుసరించాలని ట్రాన్స్‌కో సహాయ ఇంజినీర్ ఎం.శ్యాంసుందర్ అన్నారు. నగర పంచాయతీ పరిధి నెల్లివీధి, కస్పావీధిలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రెండు వందల యూనిట్ల కంటే అదనంగా విద్యుత్ వాడితే రాయితీ పోను మిగిలిన బిల్లు చెల్లించాలని సూచించారు. ఈ క్రమంలో రూ.లక్షా 3 వేల బకాయి బిల్లులను వసూలు చేశారు. బిల్లులు చెల్లించిన వారికి విద్యుత్ పునరుద్ధరించారు.

దళారులవే ధాన్యం..

- నామమాత్రంగా మారిన రైతుసేవా కేంద్రాలు
- బస్తాకు రూ. 1700 చెల్లిస్తున్న దళారీలు
- రైతుసేవా కేంద్రం ద్వారా వెళితే నాలుగు కిలోలు అదనం
- ఇంతవరకు కొనుగోలు చేసింది 1830 టన్నులే

మిల్లర్ల పెత్తనం తగ్గించాలి..

ధాన్యం కొనగోళ్లలో మిల్లర్ల పెత్తనం తగ్గించాలి. నాలుగు కిలోలు అదనంగా తీసుకోవడం సరికాదు. మిల్లర్లు ఒప్పుకుంటేనే కొనుగోలు కేంద్రం సిబ్బంది రైతుల నుంచి ధాన్యం తీసుకుంటున్నారు. దీంతో ప్రైవేట్ వర్తకులకే రైతులు ధాన్యం అమ్మాల్సి వస్తోంది.

– కండాపు ప్రసాదరావు, అభ్యుదయ రైతు



దళారులు కొనుగోలు చేసిన ధాన్యం

పాలకొండ: ధాన్యం కొనుగోలుకు సంబంధించి కూటమి ప్రభుత్వం చర్యలతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతుసేవా కేంద్రాలు నామమాత్రంగా మారడంతో దళారీలు ధాన్యం వారికి ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. పొరపాటున రైతులు కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం అమ్మితే రైస్ మిల్లర్లు 80 కిలోల బస్తాకు అదనంగా నాలుగు కిలోలు తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 40 శాతం మేర నూర్పులు పూర్తయినా.. కొనుగోలు కేంద్రాల ద్వారా కనీసం 20 శాతం ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. ఇప్పటివరకు కేవలం 1830 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. తేమశాతం లెక్కింపు, అదనంగా ధాన్యం ఇవ్వాల్సి రావడం, మరో తుఫాన్ ఉందన్న వార్తల నేపథ్యంలో ధాన్యం విక్రయాలకు రైతులు తొందర పడుతున్నారు.

– 84 కిలోలు .. రూ. 1700

ప్రస్తుతం దళారీలు రైతుల నుంచి ధాన్యం రూ. 1700 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా 84 కిలోల చొప్పున తూకం వేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఇప్పటికే సగం మంది రైతులు దళారీలకు ధాన్యం విక్రయించారు. దళారీలు రైతుల నుంచి పాస్ పుస్తకాలు తీసుకుని నేరుగా మిల్లర్లతో జతకట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

మిల్లర్లు ససేమిరా..

కొనుగోలు కేంద్రం నిబంధనలు చూసి రైతులు భయపడుతున్నారు. ముందుగా కొనుగోలు కేంద్రంలో నాణ్యత పరిశీలించిన తర్వాత మిల్లర్ల దగ్గరకు వెళ్లి ధాన్యం ధర మాట్లాడుకోవాల్సి వస్తుంది. ఇందులోనూ 84 కిలోలు చెల్లిస్తేనే మిల్లర్లు ముందుకు వస్తున్నారు. ఆ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మినహాయించి ట్రక్‌షీట్ జనరేట్ చేస్తున్నారు. దళారీలు కూడా నాలుగు కిలోలు అదనంగా తీసుకుంటున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే దళారీలే బెటరన్న ఆలోచనలో రైతులు వారికే ధాన్యం విక్రయిస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన



మురడలో ఎన్నికల నోటిఫికేషన్ పత్రం ప్రదర్శిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 14వ తేదీన జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, నోటిఫికేషన్‌ను బుధవారం ప్రదర్శించారు. తహసీల్దారు శివన్నారాయణ మాట్లాడుతూ మండలంలో మొత్తం 11 సాగునీటి సంఘాల ఉన్నాయని, వాటి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్సకు 55 మంది ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని వారపు సంత వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. అనంతరం ఆమె అక్కడికి వచ్చే రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని తెలిపారు. ఇదిలా ఉండగా, శిబిరానికి హాజరైన 160 మంది కంటి రోగుల్లో 55 మందికి శస్త్ర చికిత్స అవసరమైనట్లు నిర్వాహకులు గుర్తించారు.

ఆపరేషన్లు చేసుకునే వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడంతో పాటు ఉచిత బస్సు ప్రయాణం, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రీజనల్ తీమోటిక్ లీడ్ ప్రకాష్

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అపరాలు(పెసర, మినుము) సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఏటా ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ సూచించారు. పొలంలో భిన్నమైన పంటలు సాగు చేయడం ద్వారా జీవవైవిధ్యం రక్షించబడుతుందన్నారు. ఆ తర్వాత మండలంలోని తోటపల్లి, దత్తివలస గ్రామాలకు వెళ్లి, అక్కడ సాగు చేస్తున్న అపరాల పంటలు పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న డీటీ సుందరరావు

గరుగుబిల్లి: రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఉప తహసీల్దారు బి.సుందరరావు తెలిపారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన.. పలువురు రైతులు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ అడంగల్, ఎల్‌పీ నంబర్, ఆధార్ సీడింగ్, 22ఎ, 1ఎ, 1బి, 1డి, 1ఇలో మార్పులు చేర్పులు, మ్యుటేషన్‌కు సంబంధించిన తప్పొప్పులు, నవరణను టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్ తదితర సేవలను సదస్సుల్లో అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అన్యాయం..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం అన్నదాతకు అన్యాయం చేస్తోందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు ఆరోపించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల 13న కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ మేరకు రూపొందించిన 'అన్నదాతకు అండగా..' వాల్‌పోస్టర్లను బుధవారం ఆయన మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతన్నలకు ఇస్తామని పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను అరికట్టాలని కోరారు. ఉచిత బీమా పథకంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, పిన్నింటి శ్రీను, శంభాన శ్రీను, కోణార్క్ శ్రీను, భోగి మధన్, బిడ్డిక గిరి, తదితరులున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పుణ్యవతిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతున్న ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గురుకుల పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా సీపీఎం కేంద్రం కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. కురుపాం మండల కేంద్రంలో బుధవారం జరిగిన సీపీఎం జిల్లా మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను వీరంతా కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత 25 రోజులుగా నిరసన చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని, ఎలాగైనా తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పి.మోహన్‌రావు, కిశోర్, టి.తిరుపతిరావు, ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

సీతంపేట: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. ఈమేరకు బుధవారం స్థానిక ఏపీఆర్ గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి వంటకు ఉపయోగించే గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. లీకేజీ ఉంటే ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా... ఒకవేళ జరిగితే తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు చిక్కుకున్న వారిని ఎలా రక్షిస్తారో చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుదాం



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస/గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన ప్రజాసమస్యలపై చేపట్టే ర్యాలీకి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి బుధవారం ఆవిష్కరించారు.

కురుపాం మండలంలోని చినమేరంగిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు కార్యాలయం వరకు రైతులతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాసమస్యలపై ప్రతిఒక్కరం పోరాడుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్నిపల్లి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ..



కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు స్పష్టం చేశారు. ఈ మేరకు 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరిట రూపొందించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీమేరకు రూ. 20 వేల పెట్టుబడి సాయం అందించాలన్నారు. ధాన్యం కొనుగోలులో దళారీలను నియంత్రించడంతో పాటు ఉచిత పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు. రైతులకు అండగా చేస్తున్న పోరాటాలకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు నల్లి శివప్రసాద్, దుప్పాడ కళావతి, తిర్లంగి ఉపేంద్రకుమార్, తదితరులున్నారు.

-పాలకొండ

వడ్డంగిలో రెవెన్యూ సదస్సు



రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: మండలంలోని వడ్డంగిలో తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని చెప్పారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి, డీటీ శంకరన్ నాయుడు, ఆర్ఐ కొట్టుగుమ్మడి కృష్ణారావు, స్థానిక రైతులు బోడెపు శ్రీనివాసరావు, బి.శేషగిరిరావు, రైతులు పాల్గొన్నారు.

పక్కాగా మధ్యాహ్న భోజన పథకం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని చిట్టపులివలస ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమై ఎన్‌పీసీఐ యాక్టివేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, హౌస్ ట్యాక్స్ కలెక్షన్లు, పల్లె పండుగ పనులపై సమీక్షించారు.

సారా విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని పనస నందివాడ గ్రామంలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.కళాధర్ బుధవారం తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

సందర్శన



సీతంపేట మండలంలోని మండ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కె.గీతాంజలి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పరిశీలించారు. హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎన్‌పీసీఐ బ్యాంక్ ఖాతాలు తెరవడంలో పురోగతి సాధించాలన్నారు.

– సీతంపేట


అవగాహన పెంచుకోవాలి..



ప్రస్తుత రబీ సీజన్‌లో తుపానుల ప్రభావం నుంచి వరితో పాటు సీజనల్ పంటల సాగు, సస్యరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని గ్రామీణ వ్యవసాయ సహాయకుడు సాయి మహేష్ అన్నారు. మండలంలోని పరశురాంపురం, మల్లమ్మగూడ, సింగన్నవలస గ్రామాల్లో బుధవారం పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీలోగా రబీ పంటలైన ఎకరా పెసరకు రూ.40, మొక్కజొన్నకు రూ.72, వరి పంటకు రూ.84 వంతున బీమా మొత్తం చెల్లించాలన్నారు. రైతులు తాము పండిస్తున్న పంటల వివరాలు, ఆధార్, వన్ బీతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా బీమా చేసుకోవచ్చన్నారు.

– పాలకొండ రూరల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



చిన్నారావు

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గురుకులాల్లో ప్రస్తుతం పనిచేసే టీజీటీ, పీజీటీ, జేఎల్, పీఈటీ, పీడీ, ఆర్ట్స్–క్రాఫ్ట్, లైబ్రేరియన్ ఉద్యోగులు రూ.5 వేల వేతనానికి చాలా ఏళ్లపాటు ఉద్యోగాలు చేసి, ఇప్పుడు రూ.15 వేల వేతనానికి చేరుకున్నారన్నారు. వీరంతా రెగ్యులర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నారన్నారు. తాజాగా వీరి పోస్టుల భర్తీని కూడా డీఎస్సీలో కలిపేయడంతో వారి ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమైందన్నారు.

–గుమ్మలక్ష్మీపురం

నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. ఆయా కార్యాలయాలకు కొత్త భవనాలు రావడంతో పాత భవనాలను వదిలేశారు. దీంతో ఆయా భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా.. మరికొన్ని పాములు, విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. పాత మండల పరిషత్ కార్యాలయం భవనం పూర్తి శిథిలమైపోయింది. అలాగే ఐసీడీఎస్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయాలు శిథిలమై విష జంతువులకు ఆవాసంగా మారాయి. అలాగే ప్రస్తుతం ఉన్న మండల విద్యాశాఖ పాత కార్యాలయం కూడా ప్రమాదకరంగా మారింది. ఈ భవనాలకు మరమ్మత్తులు జరిపించి వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుందని అటు అధికారులు, ఇటు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు జరిపించాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న పాత తహసీల్దార్ కార్యాలయం



ప్రమాదకరంగా మారిన మండల విద్యాశాఖ కార్యాలయ భవనం



నిరుపయోగంగా ఉన్న పాత మండల పరిషత్ కార్యాలయం



పాములకు ఆవాసంగా మారిన ఐసీడీఎస్ కార్యాలయం

